
ప్రజాశక్తి
మంగళవారం 26 మార్చి 2024



ఎన్నికల కోడ్ ఉల్లంఘన

వాలంటీర్లతో సమావేశం... ఎమ్మెల్యే ఇంటికి తరలింపు

ప్రజాశక్తి - జామి

అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎన్నికల నియమావళిని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. తాజాగా జామి మేజరు పంచాయతీకి చెందిన వాలంటీర్లతో సమావేశం నిర్వహించి, వారిని అక్కడ నుంచి స్థానిక ఎమ్మెల్యే ఇంటికి ఆటోల్లో తరలించిన విషయం తీవ్ర చర్చనీయాంశమైంది. దీనిపై జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బండారు పెదబాబు, దళిత సంఘం నాయకులు బోని జీవన్ అంబేద్కర్ విగ్రహానికి ఫిర్యాదు చేసి, నిరసన తెలిపారు. దీనిపై ఎంపిడిఒ, తహశీల్దార్‌కు సమాచారం ఇచ్చి, చర్యలు తీసుకోవాలని కోరినా పట్టించుకోలేదని వారు వాపోయారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ప్రతి విషయం ఇసి పరిధిలోకి వస్తుందని, కానీ అధికార పార్టీ నాయకులకు కోడ్ పట్టడం లేదని చెప్పారు. అనుమతులు లేకుండా సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. స్థానిక మండల స్థాయి అధికారులు వారికి వత్తాసు పలుకుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అయితే ఈ విషయంపై అధికారులు తమకేమీ తెలియదని తప్పించుకోవడం గమనార్హం.

కొండను కొల్లగొట్టేశారు



అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్వారీ ఇదే

- సిండికేట్‌గా మారిన క్రషర్ల నిర్వాహకులు
- అనుమతులు లేకుండా క్వారీ నిర్వహణ
- 'విశ్వసముద్ర' పేరుతో గ్రానైట్ రాయి రవాణా
- బ్లాస్టింగ్‌తో ప్రజల్లో భయాందోళన
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కొండను పిండి చేసి గల్లా నింపుకొంటున్నారు.. కొంతమంది అక్రమార్కులు. అనుమతులు లేకున్నా యథేచ్ఛగా గ్రానైట్ అక్రమ రవాణా చేస్తున్నారు. ఒకటీ రెండు నెలలు కాదు.. దాదాపు పదేళ్లుగా ఈ తంతు సాగిస్తున్నారు. స్టోన్‌క్రషర్ల యజమానులే సిండికేట్‌గా ఏర్పడి ఈ వ్యవహారం నడిపిస్తున్నారు. అక్రమ రవాణా ద్వారా వారి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. కాసుల వర్షం కురిపిస్తోంది. ఇన్నేళ్లుగా ఈ దందా సాగిస్తున్నా అధికారులెవరూ దాడులు చేయకపోవడం, కనీస చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు విచ్చలవిడిగా బాంబు బ్లాస్టింగ్‌లతో పరిసర గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు.

ప్రజాశక్తి-రేగిడి

రేగిడి మండలం తాటిపాడు, కొండవలస, పెద్దశిర్లాం పంచాయతీల నడుమ ఉన్న కొండ.. అక్రమార్కులకు అడ్డాగా నిలిచింది. ఈ కొండ సంపదను అనుమతులు లేకుండా యథేచ్ఛగా అక్రమ రవాణా చేయడంతో అక్రమార్కులు లక్షల్లో కాసులు వెనకేసుకుంటున్నారు. ఎలాంటి అనుమతులూ లేకున్నా.. శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన విశ్వసముద్ర పేరుతో గ్రానైట్‌ను తరలిస్తున్నారు. స్థానికంగా ఉన్న ఏడు స్టోన్ క్రషర్లకు ట్రాక్టర్లతో కొండ సంపద తరలిపోతోంది.. పదేళ్లుగా ఈ కొండ అక్రమార్కుల చేతుల్లోనే కొనసాగుతుంది. కొండ గుట్ట రాళ్లను పగలకొట్టేందుకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం బాంబులను వినియోగిస్తున్నారు. బ్లాస్టింగ్‌తో కిలోమీటర్ల మేర రాళ్లు ఎగిరి అటుగా వెళ్లిన ప్రయాణికులు, పాదచారులు, కూలీలు, రైతులకు గాయాలైన సందర్భాలు కోకొల్లలు.

చూసీచూడనట్టు వదిలేస్తున్నారా?

తాటిపాడు, కొండవలస, పెద్ద శిర్లాంలో పగలు, రాత్రి తేడా లేకుండా బ్లాస్టింగ్ చేస్తున్నారు. వాహనాలతో రాయిని డ్రిల్లింగ్ చేసి ముక్కలుగా చేయించి ట్రాక్టర్లు, లారీలతో ఇతర ప్రాంతాలకు నలుపు, తెలుపు గ్రానైట్ రాయి ఎగుమతి చేస్తున్నారు. కొండవలస కొండ తవ్వకాల్లో ఎనిమిది నెలల క్రితం ఓ వ్యక్తి రాళ్లు పడి మృతి చెందాడు. ఈ రాళ్లగుట్ట తవ్వకాలకు అధికారులతో సంబంధం లేదంటూ అక్కడ నిర్వాహకులు ధైర్యంగా చెబుతున్నారు.. దీన్ని బట్టి చూస్తే అధికారులకు ముడుపులు అందుతున్నాయని ఆయా గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.. ఈ కొండ అక్రమాలపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఇప్పటికైనా మైన్స్, పోలీస్, రెవెన్యూ అధికారులు స్పందించి విలువైన కొండ సంపదను కాపాడాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

తనిఖీలు చేపడతాం

ప్రభుత్వ కొండ సంపదను పరిరక్షిస్తాం.. ఈ కొండ విస్తరణలో భాగంగా తవ్వకాలలో పొడవు , వెడల్పు, ఎత్తు కొలతల కొలిచి అక్రమ దారుల నుంచి రికవరీ చేయిస్తాం. మైన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తాం. అనుమతులు లేకుండా తవ్వకాలు చేసిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం. అరెస్టు చేయిస్తాం.

- రాములమ్మ, తహశీల్దార్



క్వారీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రామచంద్రపేట గ్రామస్తులు

క్వారీ పనులు నిలిపేయాలని

రామచంద్రపేట గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి-భోగాపురం

క్వారీ పనులు నిలిపేయాలని మండలంలోని రామచంద్రపేట గ్రామస్తులు క్వారీ వద్ద సోమవారం నిరసన చేపట్టారు. 'పరిమితికి మించి లోతుగా క్వారీ తవ్వకాలు, బాంబుల పేలుళ్లతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని, ఉన్న క్వారీలు చాలక మరో కొత్త క్వారీ ఏర్పాటు చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. క్వారీ పనులను నిలుపుదల చేయాలని నినాదాలు చేశారు.

భోగాపురం మండలం రామచంద్రపేట వద్ద ప్రస్తుతం కొత్త క్వారీని ఆనుకొని ఉన్న మరో క్వారీలో గత కొన్నాళ్లుగా తవ్వకాలు చేస్తున్నారు. ఇందులో సుమారు 200 అడుగులకు మించి లోతులో పేలుళ్లు నిర్వహించి తవ్వకాలు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ క్వారీ వద్దకు సోమవారం గ్రామస్తులు పెద్దఎత్తున చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న సిబ్బందితో గ్రామపెద్దలు దుక్క అప్పన్న, రామసూరి, రమణ, పోలిరెడ్డి తదితరులు మాట్లాడుతూ క్వారీ యాజమాన్యం వచ్చే వరకు పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 200 అడుగుల లోతులో బాంబు పేలుళ్లు నిర్వహించడం వల్ల ఇళ్లల్లో భూకంపం వస్తున్నట్లు ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. అసలు అంతలోతు తవ్వేందుకు గ్రామ పంచాయతీకి వచ్చి అనుమతులు చూపించాలని డిమాండ్ చేశారు.

కొత్త క్వారీ పనులు ప్రారంభించవద్దు

గ్రామ సమీపంలో ఇప్పటికే మూడు క్వారీలు ఉండగా విమానాశ్రయ నిర్మాణ సంస్థ మరో క్వారీ కోసం దరఖాస్తు చేసుకుంది. ఇటీవల ప్రజాభిప్రాయ సేకరణ కూడా జరిగింది. ఇంతలో పనులు కూడా నిర్మాణ సంస్థ మొదలు పెట్టేయడంతో గ్రామస్తులంతా సోమవారం క్వారీ వద్దకు చేరుకొని పనులు నిలిపివేయాలని నినాదాలు చేశారు. ఇప్పటికే ఉన్న క్వారీతో గ్రామస్తులంతా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఇప్పుడు కొత్తగా క్వారీ ఏర్పాటు చేయడంతో చాలా ఇబ్బందులు పడాల్సి ఉంటుందని ఆందోళన చెందారు. పనులు నిలిపేయకుంటే రోడ్డెక్కుతామని హెచ్చరించారు.

ఎస్‌ఎఫ్‌ఐ విజయోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌యులో స్టూడెంట్ యూనియన్ ఎన్నికల్లో లెఫ్ట్ ప్యానెల్ విజయం సాధించడంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన సోమవారం స్థానిక కోట జంక్షన్ వద్ద విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహనరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి సాగిస్తున్న దుర్మార్గ విధానాలను ప్రజలు ఈ లోక్‌సభ ఎన్నికల్లో తిప్పికొడతారని, దానికి జెఎన్‌యు ఎన్నికలు ప్రత్యక్ష ఉదాహరణని తెలిపారు. యూనివర్సిటీలో హింసాకాండకు పాల్పడుతున్న ఎబివిపి మతోన్మాద గూండాలపై ఎస్ఎఫ్ఐ నాయకత్వంలోని లెఫ్ట్ కూటమి ఎన్నో అడ్డంకులను ఛేదిస్తూ విజయం సాధించడం ప్రజాస్వామ్య పరిరక్షణకు నిలువుటద్దమని తెలిపారు. ఈ సందర్భంగా బాణసంచా కాలుస్తూ రంగులను జల్లుకుంటూ విజయోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.సౌమ్య, జె.రవికుమార్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాజు, పి రమేష్, తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



బొబ్బిలిలోని ఘోషా ఆస్పత్రి

ఘోషా ఆస్పత్రి మూసివేత

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న సెయింట్ జోసెఫ్ ఘోషా ఆస్పత్రిని మూసివేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. 1987లో ఘోషా ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. మాత, శిశు సంరక్షణకు, సాధారణ వ్యాధులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేవారు. మారుతున్న పరిజ్ఞానంతో ఆస్పత్రికి రోగులు అనుకున్న స్థాయిలో వెళ్లక పోవడంతో నిర్వహణ భారమైంది. దీంతో ఆస్పత్రిని ఈనెల 31 నుంచి మూసివేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.


ఎన్నికల కోడ్ అమల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎన్నికల కోడ్ అమల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన 48 గంటలలోనే బహిరంగ ప్రదేశాలలో ఉన్న పోస్టర్లు, ఫ్లెక్సీలు, ఫొటోలు, ఇతర రాజకీయ సంబంధమైన ప్రకటనలను తొలగించాలని ఆదేశాలు జారీ చేసినా కొన్ని చోట్ల తొలగించలేదని పత్రికలలో వార్తలు వస్తున్నాయని తెలిపారు. గడువు ముగిసినా తొలగించని అధికారులపై కోడ్ ఉల్లంఘన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ప్రభుత్వ భవనాలపై ఉన్న పోస్టర్లు, ఫ్లెక్సీలు, ఫొటోలు, ప్రభుత్వ వెబ్‌సైటులో ఉన్న ప్రకటనలను 24 గంటల్లోనే తొలగించాల్సి ఉందని చెప్పారు. ఇకపై ఎక్కడైనా కోడ్ అమల్లో నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని, అటువంటి అధికారులపై చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రయివేట్ భవనాలపై ఉండే ప్రకటనలను కూడా 72 గంటల్లోనే తొలగించాలని ఆదేశించారు.

కౌన్ బనేగా కేండిడేట్

- ఎమ్‌పి అభ్యర్థి కోసం వెతుకులాట
- యు టర్న్ తీసుకున్న బిజెపి
- టిడిపిలో మారిన రాజకీయ సమీకరణాలు



అశోక్ | కళావెంకటరావు | కిమిడి నాగార్జున | తెంటు లక్ష్మునాయుడు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం లోక్‌సభ అభ్యర్థిత్వం నుంచి బిజెపి అనూహ్యంగా తప్పుకోవడంతో టిడిపిలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. దీంతో అధిష్టానం అభ్యర్థి కోసం వెతుకులాట ప్రారంభిస్తోంది. ఎన్నికల పొత్తులో భాగంగా విజయనగరం లోక్‌సభ స్థానాన్ని బిజెపి కోరడం, అందుకు టిడిపి అధిష్టానం కూడా సానుకూలంగా స్పందించడం విదితమే. దీంతో, విజయనగరం ఎమ్‌పి అభ్యర్థి కోసం టిడిపి అధిష్టానం నిన్నటి వరకు ఆలోచించలేదు. బిజెపి అభ్యర్థిగా ఎవరు వస్తారా? అని జనంలో ఆసక్తికర చర్చ నడిచింది. పున:పరిశీలనలో భాగంగా బిజెపి అగ్రనాయత్వం విజయనగరానికి బదులు రాజంపేట లోక్‌సభ టికెట్‌ను తీసుకుంది. దీంతో తిరిగి టిడిపి తమ అభ్యర్థిని చూసుకోవాల్సి రావడంతో అధినాయకత్వం గెలుపు గుర్రాన్ని అన్వేషిస్తోంది. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, రాష్ట్ర మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు, టిడిపి చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు పేర్లు పరిశీలనలో ఉన్నట్టుగా సమాచారం.

ఈ ఎన్నికలు టిడిపికి చావోరేవో అన్నట్టుగా ఉండడం, లోక్‌సభ అభ్యర్థిని బట్టే అసెంబ్లీ నియోజకవర్గాల్లో బలం, బలహీనత ఉండే పరిస్థితులను భేరీజు వేస్తూ అధిష్టానం ఆచితూచి అడుగులు వేయాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో పైన పేర్కొన్న పేర్లకు ప్రత్యామ్నాయానికి కూడా పరిశీలిస్తోందట. పొత్తులో భాగంగా జనసేన, బిజెపికి కొన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు తగ్గుతాయని భావించిన టిడిపి రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది ఆశావహులను వెనక్కి తగ్గించింది. ఇలాంటి పరిస్థితుల్లో విజయనగరం అసెంబ్లీ స్థానం తన కుమార్తె అదితి గజపతిరాజుకు కేటాయించాలంటూ అశోక్ పార్టీని కోరారు. ఈ ప్రతిపాదనను చంద్రబాబు సున్నితంగా తిరస్కరిస్తూ 'మీరే పోటీలో ఉండాలి' అంటూ అశోక్‌కు సూచించారట. చివరికి అశోక్ తన కుమార్తె కోసం పట్టుబట్టారని, దీంతో బాబు కూడా అశోక్‌ను పక్కనబెట్టి అదితికి సీటు ఖరారు చేశారని విశ్వసనీయ సమాచారం. ఈ నేపథ్యంలో అశోక్ తిరిగి తన కోసం ఎమ్‌పి టికెట్ అడిగే పరిస్థితి లేకపోవడంతో, ఇదే అదునుగా బాబు కూడా విజయనగరం లోక్‌సభ స్థానాన్ని బిజెపికి హామీ ఇచ్చారట. దీంతో పార్టీ ఎమ్‌పి అభ్యర్థి కోసం ఆలోచించాల్సిన అవసరం లేకుండా పోయింది. బిజెపి తరపు ఆశావహుల్లో విజయనగరం కన్నా ఇతర స్థానాల్లో ఉన్నవారికి ప్రాధాన్యతనిచ్చింది. దీంతో, నిన్నగాక మొన్న బిజెపి విడుదల చేసిన జాబితాలో విజయనగరం లోక్‌సభను మినహాయించినట్టు సమాచారం. ఈనేపథ్యంలో టిడిపి తరపు అభ్యర్థిని బరిలోకి దింపుకునేందుకు అవకాశం కలిగింది. ఇప్పటికే విజయనగరం, మన్యం జిల్లాల్లో చీపురుపల్లి, పాలకొండ అసెంబ్లీ అభ్యర్థులను తేల్చలేక తటపటాయిస్తున్న టిడిపికి ఎమ్‌పి అభ్యర్థిని కూడా గుర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు అశోక్ తనకు తానుగా సీటు కోసం ప్రస్తావించే పరిస్థితి లేదు. అలాగని పిలిచి సీటిద్దామనుకుంటే సామాజికవర్గ విమర్శలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈనేపథ్యంలో ఎచ్చెర్ల అసెంబ్లీ సీటు ఆశిస్తున్న మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు లోక్‌సభకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదట. ఇక చీపురుపల్లిని పదేళ్లుగా అంటిపెట్టుకుని ఉన్న కిమిడి నాగార్జున కూడా ఎమ్‌పిగా పోటీకి ససేమీరా అంటున్నారట. చాలా కాలంగా చట్టసభలో అవకాశం కోసం ఎదురు చూస్తున్న మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు పేరును బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన సూచిస్తున్నట్టు సమాచారం. వీరిలో ఎవరో ఒకరిని లోక్‌సభ అభ్యర్థిగా పంపే అవకాశం ఉంది. పార్టీ నిర్ణయానికి వారు కట్టుబడి ఉంటారా? లేక ప్రత్యామ్నాయం పరిశీలిస్తారా? అనేది టిడిపిలో జరుగుతున్న చర్చ. ఈ చిక్కుముడి వీడాలంటే మరో రెండు మూడు రోజులు నిరీక్షించాల్సిందేనని పరిశీలకులు చెబుతున్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలో పోటీ అనివార్యం

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

ఈ నెల 28న జరిగే న్యాయవాదుల సంఘం ఎన్నికలో అభ్యర్థుల మధ్య పోటీ అనివార్యమైంది. గత కార్యవర్గం సమయం ముగియడంతో ఈ నెల 28న స్థానిక న్యాయవాదుల సంఘం ఎన్నికలు జరగనున్నాయి. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ జరిగింది. ఈ ఎన్నికలో అధ్యక్ష పదవికి అల్లాడ హరీష్, కంటుభుక్త శ్రీనివాసరావు, సరిపల్లి నాగేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు. ఉపాధ్యక్ష పదవికి పేడాడ శివప్రసాద్, దాసరి ఈశ్వరరావు, సంయుక్త కార్యదర్శి పదవికి ఎర్రసూరి పైడి వెంకట రమణ మూర్తి, సారిక సతీష్, కోశాధికారి పదవికి భీంపల్లి రవి, కె.చినఅప్పారావు నాయుడు నానినేషన్లు దాఖలు చేశారు. ఉపసంహరణ నేపథ్యంలో వీరి మధ్య సయోధ్య కుదరక పోవడంతో ఈ పదవులకు అభ్యర్థుల మధ్య పోటీ అనివార్యమైంది. కార్యదర్శిగా గునకర్ సంతోష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రంథాలయ కార్యదర్శిగా ఎం.పీటర్ మార్టిన్, స్పోర్ట్స్ సెక్రటరీగా ఎన్.నాగేశ్వరరావు, మహిళా రిప్రజంటేటివ్‌గా పి.రుక్మిణీ, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లుగా యువి రాజేష్, కెబ్యూలా రాణి, జూనియర్ ఎగ్జికూటివ్‌లుగా జిఎల్ లోకనాథ్ పట్నాయక్, పి.రోహిణి, జిఎల్ గాయత్రి దేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఘనంగా నారాయణ వార్షికోత్సవం



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరంకోట

గాజులరేగ వద్దనున్న నారాయణ పబ్లిక్ స్కూల్ 21వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు మాట్లాడుతూ 2003లో 56 మందితో ప్రారంభించిన పాఠశాల ప్రస్తుతం 450 మంది విద్యార్థులు, 13 మంది ఉపాధ్యాయులతో దిగ్విజయంగా నడుస్తోందన్నారు. పిల్లల ఉన్నత భవిష్యత్తు కోసం తమ ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మంచి జరిగితేనే ఓటేయండి


మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-మెరకముడిదాం

ప్రభుత్వం వల్ల మీ కుటుంబానికి మంచి జరిగితేనే తమకు ఓటు వేయాలని, లేకుంటే వద్దని మంత్రి బొత్స సత్యనారాయణ ఓటర్లను కోరారు. సోమవారం మెరకముడిదాం మండలంలోని గాతాడ పంచాయతీ పరిధిలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో కూడా జరగని అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు వద్దకు తీసుకొచ్చిన ఘనత సిఎం జగన్‌దేనని చెప్పారు. మధ్యవర్తి, దళారీ వ్యవస్థ లేని పాలన సిఎం అందిస్తున్నారని తెలిపారు. ఐదేళ్లకోసారి ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే వారిని నమ్మొద్దని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొత్స సందీప్, మండల నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, ఎస్‌వి రమణరాజు, కోట్ల వెంకటరావు, హరి బాబు, రాము, పి.కృష్ణమూర్తి, సర్పంచ్ గిడిజాల భవాని శంకర్, బూర్లె నరేష్ కుమార్ పాల్గొన్నారు.

కోలగట్ల ఎన్నికల ప్రచారం

విజయనగరం టౌన్ : ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సేవ చేసిన వారిని ఎన్నికల్లో గెలిపించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. సోమవారం నగరంలోని దాసన్నపేటలోని యాత వీధి, నాగవంశం వీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పొంతపల్లి మాలతి, వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి బొద్దాన అప్పారావు మాట్లాడుతూ నగరంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి కోలగట్ల వీరభద్ర స్వామి నేతృత్వంలో గత ఐదేళ్లలో జరిగిందన్నారు. పెద్ద పల్లెటూరిగా ఉన్న విజయనగరాన్ని కార్పొరేషన్ స్థాయికి తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, మన్యాల కృష్ణ, గదుల సత్యలత, కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి, వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి బోడసింగి ఈశ్వరరావు, మాజీ కౌన్సిలర్ కోరాడ సూర్య ప్రభావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

బాలుడి హత్య కేసులో

నిందితుడికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-విజయనగరంకోట

సంతకవిటి మండలం కొండగూడెం గ్రామంలో రెడ్డి దుర్గాప్రసాద్ (13) హత్య కేసులో ప్రధాన నిందితుడు కొండపల్లి గోవిందరావుకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ శ్రీకాకుళం మూడో ఎడిజె ఫ్యామిలీ కోర్టు సోమవారం తీర్పునిచ్చింది. ఈ మేరకు రాజాం రూరల్ సిఐ ఎస్.శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం..

రెడ్డి సూరపునాయుడు కుటుంబం రేగిడి మండలం లింగాలవలస నుండి సంతకవిటి మండలం కొండగూడెం వలస వచ్చి, బాగా స్థిరపడింది. దీంతో వారికి, కొండపల్లి గోవిందరావు కుటుంబాల మధ్య వివాదాలు ప్రారంభమయ్యాయి. అవకాశం కోసం వేచి ఉన్న కొండపల్లి గోవిందరావు... 8వ తరగతి చదువుతున్న రెడ్డి సూరపునాయుడు కుమారుడు దుర్గా ప్రసాద్‌ను 2021 మే ఒకటో తేదిన రాత్రి 8 గంటల సమయంలో ఆ గ్రామంలో ఇతర కుటుంబ సభ్యులు/నిందితులు అయిన కొండపల్లి సింహాచలం (ఎ2), కొండపల్లి శంకరరావు (ఎ3), కొండపల్లి లక్ష్మి నారాయణ (ఎ4), కొండపల్లి అన్నపూర్ణ (ఎ5) సహకారంతో హత్య చేశాడు. విషయం తెలుసుకున్న అప్పటి సంతకవిటి ఎస్ఐ సిహెచ్.రామారావు కేసు నమోదు చేశారు. అప్పటి రాజాం సిఐ ప్రస్తుతం పాడేరులో పని చేస్తున్న డి.నవీన్ కుమార్ దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితులు ఐదుగురిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించి, నిందితులపై కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. ఈ కేసులో ట్రయల్ ప్రారంభం నుండి ప్రస్తుత రాజాం రూరల్ సిఐ ఎస్.శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధతో సాక్ష్యులకు ఎప్పటికప్పుడు బ్రీఫ్ చేయడం, కోర్టు హెచ్‌సి ఇ.తారకేశ్వరరావు సకాలంలో సాక్ష్యాలను కోర్టులో ప్రవేశ పెట్టగా, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్ పోలీసు వారి తరుపున వాదనలు వినిపించారు. ఈ కేసులో నిందితుడు కొండపల్లి గోవిందరావుపై నేరం రుజువు కావడంతో 3వ ఎడిజె ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి టి.భాస్కరరావు నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.2 వేలు జరిమానా విధించారు.

'హత్య.. భ్రమ'కు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని కాగితాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 8వ తరగతి చదువుతున్న టొంపల గణేష్ 'హత్య.. భ్రమ' అనే అంశంపై చేసిన జన విజ్ఞాన వేదిక వీడియో పోటీలలో ప్రథమ బహుమతిని గెలుచుకుంది. జన విజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14 వరకు నెల రోజులుగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన సైన్స్ ప్రయోగాల వీడియో పోటీలలో కాగితాపల్లి భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు గొర్లె రమేష్ ఆధ్వర్యంలో టొంపల గణేష్ ప్రదర్శించిన "హత్య- భ్రమ"అనే ప్రాజెక్టు విజయనగరం జిల్లా తరపున ప్రథమ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రమేష్‌ను, విద్యార్థి గణేష్‌ను మండల విద్యాశాఖ అధికారులు ఎం వర ప్రసాద్ రావు, ఎరకయ్య, ఏసీ సూర్యారావు తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. ప్రభాకర్ పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు జరజాన వీలయ్య, అధ్యక్ష కార్యదర్శులు శాసన సత్యనారాయణ, పాండూర్ వేణుగోపాల్ అభినందించారు.

ఇసుక అక్రమంగా తవ్వితే కఠిన చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఇసుక అక్రమంగా తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ వి.త్రినాథరావునాయుడు, ఆర్ఐ కళ్యాణ్ చక్రవర్తి, ఎస్ఐ లోవరాజు హెచ్చరించారు. మండలంలోని పారాది, పెంట, పారాది, అలజంగి వేగావతి నదిలో ఇసుక నిల్వలను పరిశీలించారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుకతో మొదటిసారి పట్టుబడితే రూ.25వేలు, రెండోసారి పట్టుబడితే రూ.50వేలు, మూడోసారి పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలను నివారించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో విఆర్ఒలు పాల్గొన్నారు.

ముల్లు కుటుంబానికి మంత్రి పరామర్శ

ప్రజాశక్తి- గరివిడి

గరివిడికి చెందిన వైసిపి నాయకుడు, మండల మాజీ ఉపాధ్యక్షుడు ముల్లు రాంబాబు సతీమణి ముల్లు సీతమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం ముల్లు రాంబాబు ఇంటికి వెళ్లి అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రితోపాటు పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎపిఆర్‌జెసిలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని తాటిపూడి వద్ద గల ఆంధ్రప్రదేశ్ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరడానికి ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష ఉందని అందుకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మి కోరారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ గురుకుల కళాశాలలో ఎంపిసి, బైపిసి, ఎంఇసి గ్రూపుల్లో చేరడానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ఘనంగా తొలేళ్ల పండగ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని భోగాపురం, పోలిపల్లి గ్రామాలలో అమ్మవారి పండగలు ఘనంగా జరుగుతున్నాయి. మొదటి రోజైన సోమవారం తోలేళ్ళ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పోలిపల్లి గ్రామంలో అమ్మవారిని ఏడు గ్రామాల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంస్కృతి కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. భోగాపురంలో కూడా అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం నాలుగు గంటల నుంచి భోగాపురం పోలిపల్లి గ్రామంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకుంటారు. ఈ సందర్భంగా భోగాపురం సిఐ రవికుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తును నిర్వహిస్తున్నారు.

అమ్మవారికి రూ.3.25 లక్షలతో కానుకల సమర్పణ

పోలిపల్లి పైడితల్లి అమ్మవారికి గ్రామానికి చెందిన నాయుడు కుటుంబం రూ.3.25లక్షలతో సోమవారం కానుకలు సమర్పించారు. పైడితల్లి అమ్మవారికి వెండి భరిణి, పరదేశమ్మ తల్లికి వెండి కిరీటం సమర్పించి ఎసి సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేశారు.



గుర్రపు పోటీల్లో పాల్గొన్న యువకుడు

హోరెత్తిన గుర్రపు పరుగు పందేలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురంలో ముత్యాలమ్మ తీర్థ మహోత్సవం సందర్భంగా రెండో రోజు జరిగిన ఎడ్ల, గుర్రపు పందేలు ఉత్సాహంగా జరిగాయి. పోటీల్లో గెలిపొందిన విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు చేతుల మీదుగా అందజేశారు.

గెలిపిస్తే అభివృద్ధి చేస్తా: బేబినాయన

ప్రజాశక్తి- బొబ్బిలి



ప్రచారంలో పాల్గొన్న బేబినాయన

తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన కోరారు. పట్టణంలోని తొమ్మిదో వార్డు లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓటును అభ్యర్థించారు. ప్రచారంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాస రావు, జనసేన నియోజకవర్గ ఇంఛార్జి గిరడ అప్పలస్వామి, టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబర్కి శరత్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంట్యాడ: తనకు ఎమ్మెల్యేగా అవకాశమిస్తే నియోజకవర్గంలోని ప్రతి పల్లెను అభివృద్ధి చేస్తానని గజపతినగరం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం జగ్గాపురం, గొర్లి పేట గ్రామాలలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇన్చార్జీలు, యూనిట్ ఇన్చార్జీలు, బూత్ ఇన్చార్జీలు, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, యువత, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాడంగి: మహిళలను గౌరవించే ఇళ్లు, సమాజం సుఖ సంతోషాలతో ఉంటాయని బీసీ సాధికారిక కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు అన్నారు. సోమవారం కోడూరులో టిడిపి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చంద్రబాబు సీఎం అయితేనే మహిళలకు రక్షణ, సంక్షేమం లభిస్తుందని అన్నారు.

ఎన్నికల నియమావళిపై డేగకన్ను

- వైసిపి ఎమ్మెల్యే శంబంగిపై కేసు నమోదు
- ఎస్.కోట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన తహశీల్దార్
- రామభద్రపురం పోలీసులకు సిఐ పలు సూచనలు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎన్నికల నియమావళిపై ఎన్నికల అధికారులు డేగకన్ను వేశారు. నియమావళి పర్యవేక్షణకు పటిష్ట చర్యలు చేపట్టారు. ఇప్పటికే రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయగా, పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఫ్లెక్సీలు, జెండాలు, గోడ పత్రికలను తొలగించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్న రాజకీయ పార్టీలపై అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. ఎన్నికల అధికారుల అనుమతి లేకుండా నిమ్మలపాడు, ఇతర గిరిజన గ్రామాల్లో ప్రచారం చేసిన వైసిపి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడుపై ఎంసిసి నోడల్ అధికారి రవికుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నియోజకవర్గంలో తొమ్మిది ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు

నియోజకవర్గంలో ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేసేందుకు, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న రాజకీయ పార్టీలు, నాయకులపై చర్యలు తీసుకునేందుకు ఎన్నికల కమిషన్ పటిష్ట చర్యలు చేపట్టింది. నియోజకవర్గంలో తొమ్మిది ఫ్లైయింగ్ స్క్వాడ్ టీములను ఏర్పాటు చేశారు. తొమ్మిది టీములు షిఫ్ట్‌కు మూడు టీములు చొప్పున 24గంటలు ఎన్నికల నియమావళిని పర్యవేక్షణ చేస్తారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు నగదు, ఇతర సామగ్రిని తరలించకుండా నివారించేందుకు మూడు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రచారం, సభలు, ర్యాలీలలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనను పరిశీలించేందుకు ఒక వీడియో సర్వే లైన్స్ టీమ్, వీడియో వ్యూయింగ్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనను పర్యవేక్షణ చేసి చర్యలు తీసుకునేందుకు మున్సిపాలిటీలో కమిషనర్‌ను ఎంసిసి నోడల్ అధికారిగా నియమించగా బొబ్బిలి, రామభద్రపురం, తెర్లాం, బాడంగి మండలాల్లో కోడ్ ఉల్లంఘనను పర్యవేక్షణ చేసి చర్యలు తీసుకునేందుకు ఎంపిడిఒలను ఎంసిసి నోడల్ అధికారులుగా నియమించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులను స్వీకరించేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ఎక్కడ కోడ్ ఉల్లంఘన జరిగిన టోల్ ఫ్రీ నెంబర్ 08944-255888కు ఫిర్యాదు చేయవచ్చును.



మీడియా కథనాలను కంప్యూటర్‌లో పర్యవేక్షిస్తున్న సిబ్బంది

ఎన్నికల నియమావళి నిరంతర పర్యవేక్షణ

ఎన్నికల నియమావళిని పర్యవేక్షణ చేసేందుకు ఆర్‌డిఒ కార్యాలయంలో రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులతో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించేందుకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయగా సోషల్ మీడియా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వస్తున్న కథనాలను ఉల్లంఘించేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు.

ఎన్నికల నియమావళి అమలుకు పటిష్ట చర్యలు

నియోజకవర్గంలో ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌ఒ ఎ.సాయిశ్రీ అన్నారు. ఎన్నికల కోడ్ ఎక్కడ ఉల్లంఘించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నియమావళిని పాటించి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

శృంగవరపుకోట: పట్టణంలోని బర్మా కాలని, శ్రీనివాస కాలని, రైల్వే కాలనిలలోని పోలింగ్ స్టేషన్లను సోమవారం తహశీల్దార్ కిరణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, ర్యాంప్, మరుగుదొడ్లు తదితర కనీస సౌకర్యాలు సక్రమంగా ఉండే విధంగా చూడాలని, పోలింగ్ సమయంలో ఎన్నికల సిబ్బందికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను పరిశీలిస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిటి భరత్ కుమార్, విఆర్ఒ కన్నయ్య, విఆర్ఎ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



రామభద్రపురం: పోలీసులకు సూచనలు చేస్తున్న సిఐ తిరుమలరావు

ఎన్నికల విధులు పారదర్శకంగా నిర్వహించాలి

రామభద్రపురం: పోలీసు సిబ్బంది ఎన్నికల విధులు పారదర్శకంగా నిర్వహించాలని బొబ్బిలి రూరల్ సిఐ తిరుమలరావు ఆదేశించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ పక్కాగా అమలు చేయాలని సీ విజిల్‌లో వచ్చిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి సహకరించాలని సూచించారు. ప్రతీ పౌరుడు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అక్రమ మద్యం, నాటుసారా, నిషేధిత గుట్కా విక్రయాలపై నిఘా ముమ్మరం చేయాలన్నారు.

ఆసరా, చేయూత డబ్బులేవీ?

- డ్వాక్రా మహిళలకు తప్పని ఎదురు చూపులు
- బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఆసరా, చేయూత డబ్బులు ఎక్కడని డ్వాక్రా మహిళలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. సిఎం బటన్ నొక్కి నెలలు గడుస్తున్నా గ్రామీణ ప్రాంతం, నగర పంచాయతీలో ఒకటి అరా ఆసరా, చేయూత వారి వారి ఖాతాలో జమ అవుతున్నాయి గాని పూర్తి స్థాయిలో అందడం లేదని డ్వాక్రా మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రతిరోజూ ఆయా బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నామని చెబుతున్నారు. కొంత మందికి ఖాతాలో డబ్బులు పడినప్పటికీ అందరికీ పూర్తి స్థాయిలో జమైతేనే నగదు ఇస్తామని బ్యాంక్ వర్గాలు చెబుతున్నట్లు తెలుస్తోంది. కాగా ఆసరా పథకం ద్వారా మండలంలో 11950 మందికి రూ.7.94కోట్లు నాలుగో విడత జమ చేసినట్లు జనవరి 30న ఆర్భాటంగా కార్యక్రమం నిర్వహించారు. చేయూత నాలుగో విడత మండలంలో 4,566 మందికి రూ.8.56కోట్లు, నగర పంచాయతీ పరిధిలో 1678 మందికి రూ.3.14కోట్లు ఖాతాలో జమ చేసినట్లు గత నెల 14న అధికార్లు, ప్రజా ప్రతినిధులు ఆర్భాటంగా కార్యక్రమం నిర్వహించారు. అయితే ఈ రెండు పథకాలు నగదు మహిళల ఖాతాలో పడకపోవడంతో అతిగతీ లేకుండా పోయిందని అధికార్లను అడిగితే ఖాతాలో జమ అవుతాయని సర్ది చెబుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికార్లు స్పందించి ఆసరా, చేయూత నగదు ఖాతాలో వేయాలని మహిళలు కోరుతున్నారు.

టిడిపిలో మాజీ సర్పంచుల చేరిక

ప్రజాశక్తి- రేగిడి/రాజాం

రాజాం మండలం శ్యాంపురం టిడిపి క్యాంప్ కార్యాలయంలో రేగిడి మండలం సోమరాజు పేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లు బూడు పైడితల్లి, సత్యంనాయుడుతో పాటు టిడిపి అనుచ రులు, పలు కుటుంబాలు సోమవారం మాజీమంత్రి, రాజాం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్ సమక్షంలో వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కిమిడి అశోక్ కుమార్, మాజీ డిసిసిబి ఉపాధ్యక్షులు దూబ ధర్మారావు, మాజీ జెడ్‌పిటిసి ఎం. ఉషారాణి, నాయకులు గేదెల బాలమురళి, పాలూరి రామినాయుడు, బూడు ఆదినారాయణ, శాసపు గోవింద నాయుడు, చల్ల భుజంగరావు, తునివాడ ధనుంజయ్, పైల వినయ్, అంబల్ల సత్యంనాయుడు, సన్నిబాబు, బాలి రామినాయుడు, పాల్గొన్నారు.

బొబ్బిలి: తెర్లాం మండలంలోని నెమలాం గ్రామానికి చెందిన 20 యాదవ కుటుంబాలు, అలజంగి గ్రామానికి చెందిన 30 దళిత కుటుంబాలు సోమవారం వైసిపిని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. కోటలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన ఆధ్వర్యంలో టిడిపి కండువాలు కప్పి ఆహ్వానించారు.

మా కుటుంబం రుణం తీర్చుకోవాలి: మంత్రి

ప్రజాశక్తి - కొత్తవలస

గత 25 ఏళ్లగా ఎస్‌కోట నియోజకవర్గానికి చెందిన కేడర్‌కు సహాయం చేస్తున్న తమ కుటుంబం రుణాన్ని కార్యకర్తలు తీర్చుకునే సమయం వచ్చిందని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విశాఖ ఎమ్‌పిగా బొత్స ఝాన్సీ లక్ష్మిని, ఎస్ కోట ఎమ్మెల్యేగా కడుబండి శ్రీనివాసరావును గెలిపించుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం నియోజవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలలో కార్యకర్తలు కలసి కట్టుగా వైసిపి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్‌కుమార్, శోభా హైమావతి, రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడు బాబు, డిసిసిబి ఛైర్మన్ వేచలపు చినరామునాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

'యువతను జగన్ డ్రగ్ మాఫియా చిదిమేస్తోంది'

ప్రజాశక్తి- నెల్లిమర్ల

యువత భవిష్యత్‌ని జగన్ డ్రగ్ మాఫియా చిదిమెస్తుందని టిడిపి జిల్లా మహిళా అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం జరిగింది. వనజాక్షి మాట్లాడుతూ టిడిపి హయాంలో పెట్టుబడుల ఆకర్షణలో మొదటి స్థానంలో ఉన్న ఎపిని జగన్ రెడ్డి గంజాయి, డ్రగ్ రవాణాలో మొదటి స్థానానికి చేర్చారని, విశాఖను స్టేట్ క్యాపిటల్‌గా మారుస్తానని చెప్పి డ్రగ్ క్యాపిటల్‌గా మార్చారని ఆమె మండిపడ్డారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు ఎపిలోనే దొరుకుతున్నాయని, కల్తీ మద్యం మాఫియా తో ఇన్నాళ్ళు ప్రజల ఇళ్ళు ఒళ్ళు ప్రాణాలు జగన్ నాశనం చేశాడని ఇప్పుడు గంజాయి (డ్రగ్స్) కల్తీ మద్యంతో రాష్ట్రాన్ని (డ్రగ్స్) కేపిటల్‌గా మారుస్తున్నారని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో నెల్లిమర్ల పంచాయతీ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి, జిల్లా అధికార ప్రతినిధి కింతాడ కళావతి, కార్యదర్శి బొంతు ఉమా, కౌన్సిలర్లు నర్వ రామలక్ష్మి, మజ్జి అన్నపూర్ణ, మండల మహిళా అధ్యక్షులు యడ్ల లక్ష్మి, పొడుగు కృష్ణవేణి, చందక గౌరీ, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి మహిళా నాయకులు

బకాయి జీతాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విజయనగరం కార్పొరేషన్ ప్రజానీకానికి తాగునీరు అందిస్తున్న ముషిడిపల్లి, రామతీర్థం, నెల్లిమర్ల మాస్టర్ పంపు హౌస్ కార్మికులకు 2023 జూన్ నెల వేతనంలో రూ.2వేలు బకాయి ఉందని వెంటనే వాటిని ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) నాయకులు జగన్మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ 2023 నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి జీతాలతో పాటు అమృత పంప్ హౌస్ కార్మికులకు 2022 మార్చి ఏప్రిల్, సెప్టెంబర్ నెలల జీతం బకాయి ఉందని వెంటనే చెల్లించాలన్నారు. శనివారం యూనియన్ నాయకులు మరుళీ, నారాయణరావు, పైడిరాజులతో కలిసి నెల్లిమర్ల మాస్టర్ పంపు హౌస్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మార్చి 16న కమిషనర్, మున్సిపల్ డిఇ సమక్షంలో జరిగిన చర్చల్లో సోమవారం మధ్యాహ్నం నాటికి రూ.2000 బకాయి జీతంతో పాటు, సెప్టెంబర్ నెల జీతం చెల్లిస్తానని హామీ ఇచ్చి కాంట్రాక్టర్ మాట తప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి జీతాలు ఇవ్వకుంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆకలి దీక్ష చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నెల్లిమర్ల, రామతీర్థం, అమృత పంప్ హౌస్ కార్మికులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: నిరసన తెలుపుతున్న కార్మికులు

శృంగవరపుకోట: ముసిడిపల్లి, రామతీర్థం నెల్లిమర్ల మాస్టర్ పంపు హౌస్ కార్మికులకు 2023 జూన్, నవంబర్, డిసెంబర్, 2024 జనవరి, ఫిబ్రవరి జీతాలు రావాల్సి ఉందని యూనియన్ నాయకులు జగన్నాధం, లక్ష్మణ రావు, చంద్ర రావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం వారు పంపు హౌస్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మంగళవారం విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద జరిగే ఆకలి దీక్షలో పాల్గొంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ సంబరాలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి, ఉంగరాడ మెట్ట, బూరాడ, చిన్నయ్య పేట, దేవుదల తదితర గ్రామాల్లో సోమవారం హోలీ సంబరాలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పెద్దలు, యువత, మహిళలు, చిన్నారులు హెూలీ సంబరాల్లో భాగంగా రంగులు పూసుకుని ఆనందంగా గడిపారు. స్నేహానికి హోలీ నిదర్శమని చాటి చెప్పారు.

చీపురుపల్లి: స్థానికంగా సోమవారం హోలీ సంబరాలను యువతీ యువకులు, చిన్న పిల్లలు ఘనంగా జరుపుకున్నారు. పరస్పరం రంగులు చల్లుకుంటూ ఆనందంగా ఉత్సవాలను చేసుకున్నారు. పలు వీధులలో పండగ వాతావరణం నెలకొంది. హోలీ పర్వదినం కావడంతో స్థానిక ప్రజలతో పాటు వలస వచ్చిన మార్వాడీలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

బొబ్బిలి: పట్టణంలో హోలీ సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. చిన్నారులు, యువకులు ఒకరికొకరు రంగులు పూసుకుని హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మార్వాడీలు ప్రత్యేకంగా హోలీ సంబరాలు జరుపుకున్నారు.

వాలంటీర్ ఆత్మహత్య

ప్రజాశక్తి- బొబ్బిలి

వ్యవసాయ బావిలో దూకి వాలంటీర్ అలబోను వెంకట సాయి రామకృష్ణ (25) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ లోవరాజు వివరాలు మేరకు.. మున్సిపాలిటీలోని బంగారమ్మకాలనీకు చెందిన అలబోను వెంకట సాయి రామకృష్ణ 7వ సచివాలయంలో వార్డు వాలంటీర్‌గా పని చేస్తున్నాడు. ప్రతి శనివారం రామకృష్ణ శ్రీకాకుళంలో ఉన్న ఇస్కాన్ ఆలయానికి వెళ్లి ఆదివారం రాత్రికి ఇంటికి వస్తాడు. శనివారం సాయంత్రం బయటకు వెళ్లిన రామకృష్ణ ఇస్కాన్ ఆలయానికి వెళ్లాడనుకున్న కుటుంబ సభ్యులకు సోమవారం మధ్యాహ్నం మరణవార్త అందడంతో బోరున విలపిస్తున్నారు. పాతషుగర్ ఫ్యాక్టరీ-అప్పయ్యపేట రోడ్డులో ఉన్న వ్యవసాయ బావిలో అతని మృతదేహం లభ్యమైంది. బావి సమీపంలో మూడు రోజులుగా ద్విచక్ర వాహనం ఉండటాన్ని గమనించిన రైతులు బావిలో చూడగా మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు మృతుని జేబులో ఉన్న సమాచారం ఆధారంగా వాలంటీర్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శనివారం సాయంత్రం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'అగ్ని ప్రమాదం నుంచి కాపాడుకున్నారు'

ప్రజాశక్తి - భోగాపురం

అగ్ని ప్రమాదం భారి నుంచి చేపల కంచేరు గ్రామస్తులు తమ గ్రామాన్ని కాపాడు కున్నారు. సోమవారం గ్రామానికి సమీపంలో అరజల్ల ఎర్రన్నకు చెందిన సరుగుడు తోటలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దీంతో వేగంగా వీస్తున్న గాలులకు మంటలు గ్రామానికి అంటుకునే స్థాయికి చేరుకున్నాయి. గ్రామస్తు లందరూ వెంటనే అక్కడకు చేరుకుని మంట లార్పే ప్రయత్నం చేశారు. మరోపక్క నుంచి గ్రామానికి ఆనుకుని ఉన్న హ్యాచరీ సిబ్బంది నీటి సరఫరా చేయడంతో పాటు ఫైర్ ఇంజన్ రావడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

మంటల్లో చిక్కుకొని మహిళ మృతి

ప్రజాశక్తి - గజపతినగరం

మంటలో చిక్కుకొని మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం కొత్తబగ్గాం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన సారికి బంగారమ్మ(45) పొలంలో ఎండిన తప్పులకు నిప్పు పెడుతూ ఫిట్స్ రావడంతో అదే మంటల్లో చిక్కుకుని ప్రమాదానికి గురైంది. వెంటనే జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా అక్కడ వైద్యం అందించినా మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనులపై వివక్ష చూపిస్తారా ?



ఎమ్మెల్యేను నిలదీస్తున్న మహిళ

బొబ్బిలిరూరల్: గిరిజనులమని అభివృద్ధి చేయకుండా మమ్మలని వదిలే స్తారా అని గిరిజన మహిళ కోటిపల్లి సోములమ్మ ఎమ్మెల్యే శంబంగిని నిలదీశారు. సోమ వారం కాసిందొరవలస పంచాయతీ పరిధిలో దొంగరువలస గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యేను గిరిజన మహిళ పలు ప్రశ్నలతో నిలదీశారు. తమకు రోడ్డు లేదని, తాగునీరు లేదని గిరిజనులం గిరిజనులాగానే ఉన్నామని చెప్పారు.

చీపురుపల్లిలో ఎమ్‌పి బెల్లాన ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - చీపురుపల్లి

ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ సోమవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నియోజక వర్గంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి జరిగిందన్నారు. సంక్షేమంతో పాటు రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఎంతైనా అవసరం ఉందని ప్రజలకు వివరించారు. తనను ఎంపిగా, బొత్స సత్యనారాయణను ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జెడ్‌పిటిసి మీసాల వరహాలనాయుడు, ఎఎంసి ఛైర్మన్ దన్నాన జనార్ధనరావు, కనకమహలక్ష్మి అమ్మవారి ఆలయ కమిటీ ఛైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాశరావు, కోరుకొండ దాలయ్యతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మోసూరు వలస, ఎరకన్న దొరవలస, డుంగురువలస, చిలకమ్మవలస, విజయపురి గ్రామాలలో సోమవారం ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జెసిఎస్ కన్వీనర్ శంబంగి వేణుగోపాలనాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు ఉత్తరావల్లి అప్పలనాయుడు, వైస్ ఎంపిపి అరసాడ శంకరరావు, జెసిఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదర్, ఎంపిటిసి గొర్లి తిరుపతిరావు, వైసిపి నాయకులు వివిధ గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.



వేపాడ: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాం

శృంగవరపుకోట: ఎన్నికల్లో ఇచ్చిన 99 శాతం హామీలు నెరవేర్చి మీ ముందుకు వస్తున్నామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మళ్లీ ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎమ్‌పిగా బొత్స ఝాన్సీలక్ష్మిని ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఆదివారం రాత్రి మండలంలోని తిమిడి గ్రామ సందర్శన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫోక్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షుడు మోపాడ కుమార్, తిమిడి ఎంపిటిసి పదాల ధర్మారావు, వశి సర్పంచ్ బంగారు నాయుడు, పోతనాపల్లి సర్పంచ్ కూనిరెడ్డి వెంకటరావు, జెసీఎస్ మండల ఇంచార్జ్ వాకాడ సతీష్, ఎస్.కోట పట్టణ అధ్యక్షుడు రెహ్మాన్, సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు, సోంబాబు, మజ్జి శేఖర్ పాల్గొన్నారు.



చీపురుపల్లి: ప్రచారంలో పాల్గొన్న ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

వేపాడ: మండలంలోని నీలకంఠరాజుపురంలో స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సోమవారం గ్రామ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. తనను మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ వివి చిన్న రామునాయుడు, మార్కెటింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ మూకల కస్తూరి, ఎంపిపి డి. సత్యవంతుడు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.